# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- భారత్ 2047 నాటికి నౌకా నిర్మాణంలో ప్రపంచంలో ఉన్నత 5 స్థానాలలో ఒకటిగా ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు.
- కురుపాం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- విజయనగరంలో రేపు జరగబోయే శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి వెల్లడించారు.

=====================

విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులకు పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు అందించేలా కొత్త పథకాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో ఐఐటీ, ఐఐఎం నీట్ వంటి ఉన్నత విద్య చదవాలనుకునే వారికి కూడా ఈ పథకం వర్తింపచేయాలని సూచించారు. ఇందులో 4 శాతం వడ్డీకే బ్యాంకు రుణాలు ఇవ్వడంతో పాటు, దీనికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. 4 సంవత్సరాల్లో రుణాన్ని చెల్లించుకునే వెసులుబాటు ఇస్తామని అన్నారు. ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది తమ సంకల్పమని, అధికారులు దీని కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసే బాధ్యత అధికారులు తీసుకోవాలని సూచించారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతోందని కేంద్ర ఓడరేవులు, జల రవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. దేశంలో తొలిసారిగా విశాఖ పోర్టుకు చేరుకున్న VLGC (వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్) "శివాలిక్" నౌకకు కేంద్రమంత్రి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 2047 నాటికి ప్రపంచంలోని షిప్ బిల్డింగ్ లో ఉన్నత 5 దేశాలలో భారత్ ఒకటిగా ఉండాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. దేశంలో మెరిటైం అభివృద్ధికి ప్రతి ఏటా 6 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని, ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా 112 నౌకల తయారీకి ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో దుగ్గిరాజపట్నం వద్ద నౌక నిర్మాణ కేంద్రానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తుందని సర్బానంద సోనోవాల్ వివరిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

=====================

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖపట్టణలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంత్రి ఈరోజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ ఘటనపై విచారణకు వైద్య నిపుణులతో కమిటీ వేశామని, సమగ్ర విచారణ జరుగుతోందని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

విశాఖ ఉక్కు కర్మాగారం పటిష్టత, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ బలోపేతంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాది కాలంలో కేంద్ర ప్రభుత్వ సహాయం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉత్పత్తిలో స్టీల్ ప్లాంట్ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఈ ప్లాంట్‌ని బలోపేతం చేయడానికి యాజమాన్యం, కార్మికులు, ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉందన్నారు.

విరామం

=====================

ఉత్తరాంధ్ర ఇలవేల్పు విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారు సిరిమాను ఉత్సవం రేపు జరగనుంది. ఈ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ తో కలిసి విజయనగరం కోట వద్ద నుండి సిరిమాను తిరిగే ప్రాంతాలను కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు సిరిమాను రథం హుకుంపేటలో బయలుదేరి అమ్మవారి గుడికి చేరుకుంటుందని, అక్కడ రథం ఏర్పాట్లను పూర్తి చేసి మధ్యాహ్నం మూడు గంటలకు సిరిమాను ప్రారంభం అవుతుందని తెలిపారు. ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ... సామాన్య భక్తులందరికీ దర్శనం కలిగే విధంగా 2 వేల 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, సిరిమాను తిరగడంలో ఎటువంటి అవరోధాలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు.

=====================

ముంబై లో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా గ్లోబల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్లాట్ ఫాం (ESR Group) ఇండియా ఇన్వెస్టిమెంట్స్ హెడ్ సాదత్ షా, డైరెక్టర్ ప్రకృత్ మెహతాతో మంత్రి నారా లోకేష్ ఈరోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించిన ప్లగ్ & ప్లే ఇండస్ట్రియల్ పార్క్స్ పాలసీ 4.0 పెట్టుబడులకు

అనుకూలంగా ఉందని తెలిపారు. విశాఖపట్టణం, కాకినాడ, తిరుపతి మార్గాల్లో వెయ్యి ఎకరాలకు పైగా మెగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. విశాఖపట్నం, కాకినాడ పోర్టు వద్ద మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో 70 శాతం రొయ్యలను ఉత్పత్తి చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర ఎగుమతుల కోసం కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు, గిడ్డంగుల నిర్మాణం, పోర్టు ఆధారిత లాజిస్టిక్స్ లో పెట్టుబడులు పెట్టాలని ఈఎస్ఆర్ ప్రతినిధులకు మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు.

=====================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తా ఆంధ్రప్రదేశ్ నుండి రాయలసీమ మీదుగా ద్రోణి విస్తరించి ఉందని, అలాగే ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని వెల్లడించింది. వీటి ప్రభావంతో రేపు రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకటరావు వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి సమతుల్య ఆహారం, ఆరోగ్య పరిరక్షణ అత్యంత ఆవశ్యకమని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సి.హెచ్. విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట, బారువ, కంచిలి, మందస మండలాల్లోని పలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లో ఆయన ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థుల కోసం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌లో విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులు ఇష్టపడి చదవాలని, ప్రతీ ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.

=====================

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని రాజమహేంద్రవరం శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలోని పలు డివిజన్ ల కూటమి నాయకులతో కలిసి సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్.. కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు.

=====================
=====================